సాక్షి వికారాబాద్

7

గురువారం । 31 । అక్టోబర్ । 2024



పండుగకు వెళ్తూ..

ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన బషీరాబాద్ మండలంలో చోటుచేసుకుంది. 8లో ▸



పథకాలకు సర్వే కీలకం

సమగ్ర ఇంటింటి సర్వే ప్రభుత్వ పథకాల అమలుకు ఎంతో కీలకమని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ అన్నారు. 8లో ▸



ప్రజల పక్షాన పోరాటం

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ అన్నారు. 9లో ▸

న్యూస్‌రీల్

దీపావళి శుభాకాంక్షలు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: జిల్లా ప్రజలకు శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. చిరుదివ్వెలతో చీకట్లను పారదోలేది దీపావళి పండుగ అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పేదలు, రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలతో దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు

స్పీకర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



తాండూరు: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నగరంలో వారిని మర్యాద పూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

మొసలి ఉంది జాగ్రత్త



దౌల్తాబాద్: మండలంలోని బాలంపేట చెరువులో మొసలి ఉందని.. ప్రజలు చెరువు వద్దకు వెళ్లరాదని కొడంగల్ అటవీశాఖ అధికారులు సూచించారు. బుధవారం ఈ మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం చెరువులో మొసలి ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చిన విషయం తెలిసిందే. పరిశీలించిన అధికారులు చెరువులో మొసలి ఉన్నట్లు గుర్తించి బుధవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: తెలంగాణలో పెట్టుబడులు పెట్టే అవకాశాలను వివిధ కంపెనీలు పరిశీలించాలని టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. అమెరికాలోని లాస్‌వెగాస్‌లో జరుగుతున్న ఐటీ సర్వ్ సినర్జీ సమ్మిట్‌లో తెలంగాణ ప్రతినిధులుగా ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరయ్యారు. సమ్మిట్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులను వారు కలిశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో తెలంగాణ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాల సాధన, స్మార్ట్ గవర్నెన్స్ కోసం తెలంగాణ రూపొందించిన ప్రణాళికల అమలు, ఏఐ ఇన్నోవేషన్ కేంద్రంగా ఫ్యూచర్ సిటీని మార్చాలన్న ప్రభుత్వాశయం, పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ సిస్టం, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల, ఈ గవర్నెన్స్ కార్యక్రమాలు, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ లక్ష్యాలను వివరించారు.

దీపావళి సందడి



అనంతగిరి: వికారాబాద్‌లో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న జనం

దీపావళి పండుగను ఘనంగా జరుపుకొనేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. పండుగ ఏర్పాట్లలో మహిళలు బిజీగా గడిపారు. బుధవారం వీధుల్లో సందడి వాతావరణం కనిపించింది. ప్రజలు పూలు, పండ్లు, ప్రమిదలు, గుమ్మడి కాయలు కొనుగోలు చేశారు. టపాసుల దుకాణాలు జనం, పిల్లలతో నిండిపోయాయి.



బొంరాస్‌పేట: టపాసులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

13 రోజులు



సర్వే సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

1,94,956 కుటుంబాలు

6నుంచి ఇంటింటి కుటుంబ సర్వే

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- 2011 జనాభా లెక్కల ప్రకారం ముందుకు..
- పది ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్
- శిక్షణ కార్యక్రమాలు పూర్తి
- నవంబర్ నెలాఖరుకు కంప్యూటరీకరణ

వికారాబాద్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమానికి అధికారులు సిద్ధమవుతున్నారు. నవంబర్ 6నుంచి 18వ తేదీ వరకు 13 రోజుల పాటు ప్రజల నుంచి వివరాలు సేకరించనున్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు నమోదు చేస్తారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా సర్వే ప్రక్రియ సాగనుంది. అలాగే ప్రస్తుతం జిల్లా జనాభా, కుటుంబాల సంఖ్య అంచనాల ప్రకారం సర్వే చేసేందుకు అధికారులు ప్లాన్ చేసుకుంటున్నారు. బుధవారంతో సర్వే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం పూర్తి చేశారు. నవంబర్ ఒకటి నుంచి 3వ తేదీ వరకు ఎన్యుమరేటర్లు వారు సర్వే చేయాల్సిన ఇళ్లు, కుటుంబాల వివరాలను నమోదు చేసుకుంటారు. 5న సర్వే ఫారాలు తీసుకోవాల్సి ఉంటుంది. 6నుంచి 18వ తేదీ వరకు సర్వే కొనసాగుతుంది. 19నుంచి 27వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు డాటా ఎంట్రీ చేయనున్నారు. 30న పూర్తిస్థాయి రిపోర్టు అందజేస్తారు.

2011 గణాంకాల ఆధారంగా..

ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న జనాభా లెక్కల ప్రకారం ఈ సర్వే చేయనున్నారు. అప్పటి లెక్కల ప్రకారం జిల్లాలో 1,94,956 కుటుంబాలు, 9.27 లక్షల జనాభా ఉంది. నాలుగు మున్సిపాలిటీలు, 147 బ్లాకులు, 585 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, ఐకేపీ సీసీలు, వీఏఓలు సర్వే విధుల్లో పాల్గొననున్నారు. పది ఇళ్లకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమిస్తారు. సర్వే పర్యవేక్షణ కోసం పది మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. వీరితో పాటు ఎంపీడీఓలు, ఎంపీఈఓలు, స్థానిక సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న అన్ని స్థాయిల అధికారులు, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ సర్వేను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. రెండు ఫార్మెట్లలో పొందుపరిచిన ప్రశ్నావళి ఆధారంగా సమగ్ర వివరాలు నమోదు చేస్తారు.

ఉపాధ్యాయులు లేకుండానే..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు ఈసారి ఉపాధ్యాయులు లేకుండా నిర్వహించనున్నారు. టీచర్లను బోధనేతర పనులకు వినియోగించవద్దనే నిబంధనల నేపథ్యంలో విద్యాశాఖ వారిని మినహాయించి అందుబాటులో ఉన్న ఇతర శాఖల ఉద్యోగులతో సర్వే చేయించేందుకు సిద్ధమవుతోంది. ఇటీవలి కాలంలో పలు రకాల ఆరోగ్య, కుటుంబ సర్వేలు, ఓటరు నమో దు కార్యక్రమాల్లో పాల్గొన్న వారు ఉండటంతో సర్వేకి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు. అయితే వయసు పైబడిన వారు, సంకేతికతను అందిపుచ్చుకోలేని వారు విధుల్లో పాల్గొననుండటంతో కొంత ఇబ్బంది ఏర్పడనుంది.

> **“అన్ని చర్యలు తీసుకుంటున్నాం**
>
> సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సర్వే కోసం సిబ్బందిని ఎంపిక చేసి మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశాం. ఎప్పటికప్పుడు సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తాం. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం సర్వేను ప్రక్రియను పూర్తి చేస్తాం. ఇందుకు ప్రజలు సహకరించాలి
>
> – సుధీర్, అడిషనల్ కలెక్టర్

సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్, మండల సర్వే సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వేకు సిద్ధం కావాలని ఆదేశించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. తప్పిదాలకు తావులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా నాయకులు చొరవ తీసుకోవాలని కోరారు. నవంబర్ 28వ తేదీ వరకు నూతన ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు, ఓటరు జాబితాల అభ్యంతరాలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నవంబర్ 9, 10 తేదీల్లో ఓటరు నమోదు కోసం బూతు స్థాయిలో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- మోదీ నాయకత్వంలో దేశం అన్ని విధాలా అభివృద్ధి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కుల్కచర్ల: రాష్ట్రంతోపాటు దేశంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించబోతోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన అవినీతికి రాష్ట్రం అధోగతి పాలైందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ వెనుకబాటుకు గురవడం తప్పిస్తే అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు బీజేపీ బలపడటాన్ని చూసి ఓర్వలేక కుల, మత, ప్రాంతీయ విబేధాలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని, అది సాధ్యంకాని పని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రహ్లాదరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్టా పరమేశ్వర్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్, ఉపాధ్యక్షుడు జానకీరాం చౌహాన్, కుల్కచర్ల మండల అధ్యక్షులు సూర్యకాంతం, ప్రధాన కార్యదర్శి హన్మంతు, జి.వెంకటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు మైపాల్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

జల సంరక్షణపై దృష్టి సారించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రవిశంకర్

- భూగర్భ జల సంరక్షణ శాఖ జిల్లా అధికారి రవిశంకర్

అనంతగిరి: భవిష్యత్ తరాల కోసం భూగర్భ నీటి వనరులను కాపాడుకోవాలని భూగర్భ జల సంరక్షణ శాఖ జిల్లా అధికారి రవిశంకర్ తెలిపారు. బుధవారం కొత్తగడి పాఠశాలలో సీడ్ స్వచ్ఛంద సంస్థ.. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టులో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేనందున వ్యవసాయ రంగం భూగర్భ జలాలపై ఆధారపడి ఉందన్నారు. వర్షపు నీరు వృథాగా దిగువకు పోకుండా రైతులు పొలాల్లో కుంటలు నిర్మించుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలు ఎంచుకొని బిందు సేద్యం చేయాలన్నారు. వ్యవసాయ బోర్లు వేయాలనుకునే రైతులు కొబ్బరికాయ కొట్టే పద్ధతి కాకుండా తమ శాఖను సంప్రదిస్తే బోర్ పాయింట్ల కోసం శాస్త్రీయంగా సర్వే చేసి స్థలం ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎస్ నాగబ్రహ్మాచారి మాట్లాడుతూ.. విద్యార్థులు భూగర్భ జలాల సంరక్షణపై కుటుంబ సభ్యులు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. భూగర్భ జలాలను కాపాడుకుంటామని రైతులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా భూగర్భ జాల సంరక్షణ శాఖ అధికారులు వజీయొద్దీన్, డాక్టర్ కే భాగ్య, వ్యవసాయ విస్తరణ అధికారి సరిత, ప్రధానోపాధ్యాయులు వీరకాంతం, దత్తాత్రేయ, సీడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది రవికుమార్, అమరేశ్వరాచారి, మెజీషియన్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మా పోరాటానికి మద్దతివ్వండి

- సీపీఐ నేత కూనంనేని కోరిన ఫార్మా భూ బాధితులు

దుద్యాల్: మండలంలోని ఫార్మా భూ బాధితులు బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిశారు. ఫార్మా కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. ఈ మేరకు నగరంలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో కూనంనేనికి వినతిపత్రం అందించారు. అనంతరం ఫార్మా బాధితులు మాట్లాడుతూ.. దుద్యాల్ మండలం లగచెర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం ప్రభుత్వం 1,375 ఎకరాల భూమిని సేకరిస్తోందని తెలిపారు. గిరిజనులు బతుకుతున్న పచ్చని పొలాల్లో విషం చిమ్మే ఫార్మా కంపెనీల ఏర్పాటుకు సిద్ధమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎన్ని ఆందోళనలు చేస్తున్నా సర్కారు మాత్రం వెనక్కి తగ్గడం లేదని నిట్టూర్చారు. ఎంతో మంది పేదలు, కార్మిక, కర్షకులకు అండగా నిలిచిన సీపీఐ మద్దతు కోరుతున్నామని స్పష్టంచేశారు. ఈ విషయమై కూనంనేని స్పందిస్తూ.. పేదలకు అన్యాయం జరగనివ్వబోమని, బాధితుల పక్షాన నిలబడి పోరాడుతామని స్పష్టంచేశారు. ఫార్మా రద్దు విషయాన్ని ముఖ్యమంత్రితో మాట్లాడుతానని చెప్పారు. ఫార్మా వ్యతిరేక పోరాట సమితి సభ్యులు గోపాల్‌నాయక్, సురేశ్‌రాజ్, నారాయణ, హన్మంతు, మల్లేశ్, నర్సయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఫార్మా ఏర్పాటు వ్యతిరేక సమితి సభ్యులు

వికారాబాద్‌లో భారీ వర్షం



వికారాబాద్‌లోని ప్రధాన రోడ్డుపై నిలిచిన వరద నీరు



వర్షం కారణంగా నిలిచిపోయిన వాహనాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం దాదాపు 2గంటల పాటు ఏకధాటిగా వాన పడింది. దీంతో చిరు వ్యాపారులు, పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన పూలు, పండ్లు, గుమ్మడి కాయలు, ప్రమిదలు, పూజా సామగ్రి వర్షానికి కొట్టుకుపోయాయి. పలు కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. భారీ వర్షానికి టపాసుల దుకాణాలు కూలిపోయాయి. టపాకులు తడిసిపోవడంతో వ్యాపారులు నష్టపోయారు.



భారీ వర్షానికి కూలిన టపాసుల దుకాణాలు



వర్షానికి కొట్టుకుపోతున్న పూలు, పండ్లు

క్లుప్తంగా

ఎదురెదురుగా బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తల్లి, కొడుకు

ధారూరు: ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండల పరిషత్ కార్యాలయం సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధారూరు నుంచి యాలాల మండలం సంగాయపల్లితండాకు ద్విచక్ర వాహనంపై ధోని తన తల్లి లల్లీబాయితో వెళుతున్నారు. ఈ క్రమంలో మండల పరిషత్ కార్యాలయం మలుపు వద్దకు రాగానే గురుదోట్ల నుంచి బైక్‌పై వస్తున్న శ్రీకాంత్ ఎదురుగా వస్తున్న వీరిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ధోని, లల్లీబాయిలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవతల చిత్రాలతో ఉన్న టపాసులు విక్రయించొద్దు


పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందిస్తున్న బజరంగ్‌దళ్ సభ్యులు

తాండూరు: దీపావళి పండగ కోసం మార్కెట్‌లో విక్రయిస్తున్న టపాసులపై హిందూ దేవుళ్ల ఫొటోలు ఉంటే చర్యలు తీసుకోవాలని తాండూరు బజరంగ్‌దళ్ సభ్యులు బుధవారం పట్టణ ఠాణాలో వినతిపత్రం అందించారు. టపాసులపై దేవతల చిత్రాలు పెట్టి కాల్చడం హిందువుల మనోభావాలను దెబ్బ తీయడమే అవుతోందని సీఐ సంతోష్‌కు విన్నవించారు.

చట్ట వ్యతిరేక చర్యలపై ఉక్కుపాదం

తాండూరు రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి


ఠాణాలో రికార్డులను పరిశీలిస్తున్న సీఐ

యాలాల: చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని తాండూరు రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం యాలాల ఠాణాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఠాణాలో నమోదైన కేసుల వివరాలు, క్రైం రేటును ఎస్‌ఐ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, కేసుల నమోదు, ఫిర్యాదుదారులతో వ్యవహార శైలి తదితర అంశాలను పరిశీలించారు. మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాల పట్ల కఠినంగా ఉండాలని ఎస్‌ఐ శంకర్‌కు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

జైలు భయంతో ఆత్మహత్య

భార్య మృతి చెందిన నాలుగు రోజులకే ఉరి వేసుకున్న భర్త

చేవెళ్ల: ఇటీవల భార్య ఆత్మహత్య చేసుకోగా తాజాగా భర్త కూడా ఉరి వేసుకున్న సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చనువెళ్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 26వ తేదీన దంపతులు గొడవ పడిన సంఘటనలో భార్య వనజ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో తను జైలుకు పోతానేమోనని భయంతో భర్త అల్లరి రాజు అలియాస్ నాగేశ్(35) ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి గ్రామ శివారులో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి తల్లి అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల మృతితో వారి పిల్లలు (ఇద్దరు కూతుర్లు, కొడుకు) అనాథలుగా మారారు.

పండుగకు వెళ్తూ.. కానరాని లోకాలకు

సొంతూరులో కుటుంబసభ్యులతో పండగ జరుపుకొనేందుకు వారంతా ఉత్సాహంగా బైక్‌పై బయలుదేరారు. రోడ్డు ప్రమాద రూపంలో మాటేసిన మృత్యువు ఇద్దరినీ బలిగొంది. ఈ విషాద ఘటనతో కుంటుబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

- బైక్– ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం
- ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం


మోహన్ రాథోడ్ (ఫైల్)


రామ్‌చరణ్ (ఫైల్)

బషీరాబాద్: ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైక్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన బషీరాబాద్ మండలం కాశీంపూర్ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హంక్యానాయక్‌తండాకు చెందిన రామ్‌చరణ్(14) నవల్గా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తాండూరు నివాసముండే ఆ బాలుడు తనకు వరుసకు అన్న అయిన(పెద్దనాన్న కొడుకు) సునీల్‌తో కలిసి దీపావళి వేడుక కోసం స్వగ్రామానికి బయలుదేరారు. ఇరువురినీ బంధువైన నంద్యానాయక్‌తండాకు చెందిన మోహన్ రాథోడ్(40) బైక్‌పై తాండూరు నుంచి తండాకు తీసుకెళ్లారు. మార్గమధ్యలో కాశీంపూర్ సమీపంలోకి రాగానే కర్ణాటకకు చెందిన ఆటో కూలీలతో తాండూరు వైపు ఎదురుగా వస్తోంది. ఈ క్రమంలో బైక్, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రామ్‌చరణ్ ఘటనా స్థలంలోనే మృత్యువాత పడగా, బైక్ నడిపిన మోహన్ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెనకాల కూర్చున్న సునీల్, ఆటో డ్రైవర్ సతీష్, మరో వృద్ధుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

గుండెలవిసేలా రోదించారు

దీపావళి పండుగను జరుపుకోవడానికి ఇంటికి బయలు దేరిన వారు మార్గమధ్యలోనే ప్రమాదానికి గురై అనంతలోకాలకు వెళ్లడంతో వారి కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. నంద్యానాయక్‌తండాకు చెందిన మోహన్, రామ్‌చరణ్ కుటుంబ సభ్యులు తాండూరు జిల్లా ఆస్పత్రి మర్చురీ వద్దకు చేరుకొని విగతజీవులుగా పడి ఉన్న వారిని చూసి గుండెలవిసేలా రోదించారు.

సకాలంలో స్పందించని 108 సిబ్బంది

ప్రమాదం జరిగిన వెంటనే వాహనదారులు 108కి కాల్ చేశారు. సుమారు 35 నిమిషాల పాటు ఘటనాస్థలంలోనే క్షతగాత్రులు ఉన్నా అంబులెన్సులు రాలేవని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. చివరకు మోహన్, సునీల్, సంతోష్‌లను బైక్‌లపై తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సకాలంలో అంబులెన్సు వచ్చి ఉంటే మోహన్ బతికేవాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా బషీరాబాద్ పోలీసులు కూడా ప్రమాదంపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని బాధితులు మండిపడ్డారు. సమాచారం ఇచ్చిన పోలీసులు సకాలంలో స్పందించలేరని ఆరోపించారు. ప్రమాదంపై ఎస్‌ఐ గఫార్‌కు మీడియా ప్రతినిధులు ఫోన్‌లు చేసిన అందుబాటులోకి రాలేదు.


ఘటనాస్థలిలో వాహనాలు

ప్రభుత్వ పథకాలకు సర్వే కీలకం

- సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్
- ఎన్యూమరేటర్లకు ప్రత్యేక శిక్షణ

తాండూరు రూరల్: సమగ్ర ఇంటింటి సర్వే రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాల అమలులో ఎంతో కీలకం అవుతుందని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. బుధవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే నెల 6వ తేదీ నుంచి గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సమగ్రంగా సర్వే చేయాలని చెప్పారు. ఒక్కో ఎన్యూమరేటర్ 150 ఇళ్ల సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. మొత్తం 57 అంశాలతో కూడిన ఫారం పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఎనిమిది మంది సూపర్‌వైజర్లు ఉంటారన్నారు. ప్రతి ఇంటి యజమానులు సర్వేకు సహకరించి వివరాలు తెలియజేయాలని కోరారు. ముఖ్యంగా ఆధార్‌కార్డు, ధరణి పాసు పుస్తకం, రేషన్‌కార్డు, కులం సర్టిఫికెట్ అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. సమగ్ర సర్వేకు సంబంధించి నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఏపీఎం ఆనంద్, ఎంపీఓ ఆనంద్‌రావు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

‘మల్టీపర్పస్’ను రద్దు చేయాలి


మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన ఆశ, గ్రామ పంచాయతీ వర్కర్లు

- సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్
- ధర్నా చేపట్టిన ఆశ, గ్రామ పంచాయతీ వర్కర్లు

ధారూరు: మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆశ, గ్రామ పంచాయతీ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లతో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. ప్రమాదబీమాను వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధిక పని భారం తగ్గించి ఎనిమిది గంటల విధానం అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటుదని, ప్రతి సర్వేలోనూ వీరిని వినియోగిస్తున్నారన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తగిన చొరవ తీసుకుని అందరికీ కనీస వేతనాలు అమలు అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, ఆశవర్కర్లు, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు ప్రమీళ, శారద, సుజాత, కృష్ణవేణి, సలీం, బాలయ్య, మోతిలాల్, అంజయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో మెరిసిన ‘రంగారెడ్డి’


ట్రోఫీ అందుకుంటున్న రంగారెడ్డి జట్టు

గోదావరిఖనిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రన్నరప్

కొడంగల్ రూరల్: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచిందని కొడంగల్ జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల పీడీ అజీజ్ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి వీరేశం రంగారెడ్డి జట్టులో ఆడడం, రాష్ట్ర స్థాయి పోటీల్లో రంగారెడ్డి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలవడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖనిలో బుధవారం నిర్వహించారు. ఇందులో రంగారెడ్డి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచిందని తెలిపారు. కొడంగల్ పీడీ అజీజ్ ఆధ్వర్యంలో వెళ్లిన విద్యార్థి వీరేశం బహుమతి సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందని పాఠశాల హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌కుమార్ విద్యార్థికి అభినందనలు తెలిపారు.


విద్యార్థి వీరేశంతో పీడీ అజీజ్

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

తాండూరు రూరల్: అక్రమంగా కలప రవాణా చేస్తున్న ఓ వాహనాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. మిట్టబాసుపల్లి గ్రామం నుంచి డీసీఎంలో తాండూరు పట్టణానికి కలప రవాణా చేస్తున్నారు. మంగళవారం రాత్రి గౌతపూర్ శివారులో కరన్‌కోట్ పోలీసులు తనిఖీ చేస్తుండగా డీసీఎంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న కలపను గుర్తించారు. దీంతో వాహనంపై కేసు నమోదు చేసి ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

800 లీటర్ల డీజిల్ పట్టివేత

- కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న దుండగులు
- కేసు నమోదు చేసిన కరన్‌కోట్ పోలీసులు

తాండూరు రూరల్: కర్ణాటక నుంచి బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న డీజిల్‌ను బుధవారం పోలీసులు పట్టివేశారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం నుంచి బొలెరో వాహనంలో డ్రమ్ముల ద్వారా డీజిల్‌ను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బెల్కటూర్ వద్ద బొలెరో వాహనాన్ని పట్టుకున్నారు. డ్రమ్ముల్లో దాదాపు 800 లీటర్ల వరకు డిజిల్ ఉందని పోలీసులు తెలిపారు. వాహనాన్ని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌ను తరలించారు. డ్రైవర్ కామేష్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. తెలంగాణ కంటే కర్ణాటకలో డీజిల్, పెట్రోల్ తక్కువ ధరకు లభించడంతో.. వాటిని అక్రమంగా ఇక్కడికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని పోలీసులు వివరించారు.

తప్పిపోయిన బాలిక సురక్షితం



అనంతగిరి: వికారాబాద్‌లో మూడేళ్ల బాలిక తప్పిపోయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. సదరు బాలిక మరాఠీలో మాట్లాడుతుంది. కాగా చిన్నారిని పట్టణంలోని బాలరక్షక్ భవనంలో ఉంచామని జిల్లా మహిళా సంక్షేమాధికారి కృష్ణవేణి తెలిపారు. బాలికకు సంబంధించి పూర్తి వివరాలు తెలియరాలేదు. తల్లిదండ్రులు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో వెంటనే తమను సంప్రదించాలని అధికారి తెలిపారు.

కుల వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం


పౌర హక్కులపై మాట్లాడుతున్న ఎస్‌ఐ గిరి

పెద్దేముల్: కుల వివక్షత లేకుండా ప్రతిఒక్కరూ సమానంగా హక్కులను కలిగి ఉండాలని పెద్దేముల్ ఎస్‌ఐ గిరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మానవ హక్కుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సదుపాయాలు, ప్రభుత్వ గృహాల గురించి వివరించారు. గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి అవలంబిస్తే చర్యలు తీసుకోవటంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సిమేన్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి ప్రణాళికలు సిద్ధం

- గ్రామసభల ద్వారా పనుల ఎంపిక
- ఈజీఎస్ పనుల ద్వారా గ్రామాలాభివృద్ధికి చర్యలు

దౌల్తాబాద్: పేదలకు వంద రోజుల పాటు పని కల్పించి వారిని ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా పనులు చేపట్టడానికి మండలంలోని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీలో ఎలాంటి పనులు చేపట్టాలో గ్రామ అవసరాలకు ఏవి ఉపయోగపడుతాయో గుర్తిస్తున్నారు. వాటి కోసం మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామసభలు కూడా నిర్వహించారు. ఈ గ్రామసభలో తీర్మానం చేసిన పనులను సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ఏఏ పనులు చేపట్టాలో గ్రామసభలో తీర్మానాలు చేస్తున్నారు.

ఉపాధి హామీలో చేపట్టే పనులు

- మురుగునీరు రోడ్లపై పారకుండా ఇంటి వద్దనే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం.
- పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలను నిర్మించడం.
- పాఠశాలలో వంట గదులు ఏర్పాటు చేయడం.
- రైతులకు టేకు మొక్కల పంపిణీ చేసి సంరక్షించడం.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- రైతుల భూములను సారవంతం చేయడానికి చెరువు మట్టిని తరలించడం.
- చెలక భూముల్లో కందకాల తవ్వడం, పంట చేల వద్దకు రోడ్ల నిర్మాణం.
- భూగర్భ జలాలు పెంపొందించేలా నీటి రక్షణ పనులు
- సాగు నీటి కాల్వల పూడికతీత

పనుల గుర్తింపు

మండలంలో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాం. గ్రామాల్లో ఏఏ పనులు చేయాలో రైతుల అభిప్రాయాలు స్వీకరించాం. గ్రామాల్లో చేయాల్సిన పనుల వివరాలు తెప్పించుకుంటాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– కృష్ణహరి, ఇన్‌చార్జి ఏపీఓ

ప్రమిదల అలంకరణపై అవగాహన

కొడంగల్ రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బుధవారం డ్రాయింగ్ మాస్టర్ తిరుమలేష్ విద్యార్థినులకు ప్రమిదలకు కలర్‌తో అలంకరణ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌యూపీడబ్ల్యూ(సోషల్లీ యూజ్‌ఫుల్ ప్రొడక్టివ్ వర్క్)లో భాగంగా దీపావళి పండగను పురస్కరించుకొని ఇళ్లలో దీపాలను కలర్ వేసి అందంగా అలంకరించుకునే విధానంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కావాల్సిన వస్తువులు, నీరు, రంగులు, బ్రష్‌లు, కుందన్స్, కలర్ కాంబినేషన్ తదితర విధానాలను వివరించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారని ఆయన తెలిపారు.



దీపాంతలతో డ్రాయింగ్ మాస్టర్, విద్యార్థినులు

తల్లీకుమారుడి అదృశ్యం

పహాడీషరీఫ్: భర్తతో గొడవపడిన గృహిణి కుమారుడితో కలిసి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్షగూడ గ్రామానికి చెందిన పత్లావత్ సరిత(27)కు తుక్కుగూడకు చెందిన పత్లావత్ రాజుతో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. ఈ నెల 28వ తేదీన భార్యాభర్తలు గొడవపడ్డారు. అనంతరం డ్యూటీకి వెళ్లిన రాజు మరుసటిరోజు ఉదయం వచ్చి చూడగా భార్యతో పాటు కుమారుడు సాత్విక్(12) కనిపించలేదు. ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకుండా పోయింది. సరిత సోదరుడు రూప్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో గాని 8712662367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.


కొడుకుతో సరిత (ఫైల్)

హామీలు అమలు చేయండి


సమావేశమైన ఉద్యమకారులు

తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు

మొయినాబాద్: రాష్ట్ర సాధన కోసం కీలకంగా పనిచేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు కేబుల్ రాజు, కుమ్మరి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం మొయినాబాద్‌లో ఉద్యమకారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమకారులకు ప్రభుత్వం 250 ఇంటి స్థలం ఇస్తానని హామీ ఇచ్చిందన్నారు. దాన్ని వెంటనే అమలు చేయడంతోపాటు ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం తీర్చాలన్నారు. ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్తర తెలంగాణలో చేపట్టినట్లుగా త్వరలోనే దక్షిణ తెలంగాణలోనూ పాదయాత్ర చేపడతామన్నారు. ఆ పాదయాత్రను మొయినాబాద్ నుంచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు అవినాష్‌యాదవ్, ముకుందరెడ్డి, మేడిపల్లి నర్సింహ, కృష్ణ, వెంకటరత్నం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కులగణన నిర్వహించాలి


పరిగి: నిరసన వ్యక్తం చేస్తున్న బీఎంపీ నాయకులు


కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్

పరిగి: కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టి, ఓబీసీ వర్గాలకు జనాభా దమాషా ప్రకారం అన్ని రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని భారత్ ముక్తి మోర్చా పార్టీ(బీఎంపీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. భారత్ ముక్తి మోర్చా, పిచడా వర్గ్ మోర్చా, ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1931 నుంచి ఇచ్చటి వరకు దేశంలో బీసీల జనగణన చేయలేదన్నారు. ఆంగ్లేయులు చేసిన లెక్క ప్రకారం రిజర్వేషన్‌లను కేంద్రం అందిస్తుందన్నారు. కాంగ్రెస్ యాభై సంవత్సరాలు అధికారంలో ఉండి బీసీలను పట్టించుకోలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకా బీసీ కులగణన చేస్తామని చెప్పి పది సంవత్సరాలు పూర్తి అయినా ఇప్పటి వరకు చేయడం లేదన్నారు. దేశంలో బీసీలకు చాలా అన్యాయం జరుగుతుందన్నారు. బీసీల కులగణనతో పాటు ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిన ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని కోరారు. కార్యక్రమంలో మాస్ సంస్థ చైర్మన్ గట్ట్యానాయక్, బీసీ మోర్చా మండల కన్వీనర్ ప్రవీణ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మేమెంతో.. మాకంత

కొడంగల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం ద్వారా కులగణన చేపట్టాలని బీసీ సంఘాల, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భారత్ ముక్తి మోర్చా, బహుజన క్రాంతి మోర్చా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశంలో అత్యధికంగా ఉన్నటువంటి ఓబీసీలకు దేశ వ్యాప్తంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగ తదితర అన్ని రంగాల్లో సమాన వాటా అందించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు సమాన రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. ప్రభుత్వం కులగణన చేపట్టి ఎవరి జనాభా ఎంతనో వారికంత రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. దశల వారీగా పోరాటాలకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ తాలుకా నాయకుడు బాలరాజు, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, ముదిరాజ్ మండల అధ్యక్షుడు కూర వెంకటయ్య, నాయకులు చంద్రయ్య, లక్ష్మణ్‌నాయక్, సంతోష్‌నాయక్, అశోక్, అరుణ్‌నాయక్, హన్మంతు, వెంకటప్ప, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.